క్లుప్తంగా

గజవాహనంపై లక్ష్మీనారాయణుడి విహారం

గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరిలో వెలసిన శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేతం శ్రీవారికి తిరుమంజనం నిర్వహించారు. ప్రధాన అర్చకుడు మాధవన్ ఆధ్వర్యంలో విశేష పూజలు జరిపించారు. అనంతరం దేవదేవేరులను గజవాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ శ్రీధర్, సుమిత్ర దంపతులు, న్యాయవాది వాసు, మేనేజర్ నల్లా వెంకటేష్ రెడ్డి పాల్గొన్నారు.

రేపు వడమాలపేటలో కంటి వైద్య శిబిరం

పుత్తూరు రూరల్: వడమాలపేట బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సీహెచ్‌ఓ పురుషోత్తంరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తిరుపతిలోని వెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించే శిబిరంలో ఉచితంగా పరీక్షలు, అవసమైన వారికి శస్త్ర చికిత్సలు, మందులు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. రోగులు తమ వెంట ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డుల జిరాక్స్ తీసుకురావాలని సూచించారు.

శ్మశానానికి దారి ఏర్పాటు



ముళ్లకంపలు తొలగిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నగరి : మండలంలోని కావేటిపురం గ్రామ శ్మశానానికి రోడ్డు, చదును చేసే పనులను వైఎస్సార్‌సీపీ నేతలు శుక్రవారం చేపట్టారు. మంత్రి రోజా ఆదేశాల మేరకు పనులు ప్రారంభమయ్యాయి. జేసీబీ సాయంతో ముళ్లకంపలను తొలగించి దారి ఏర్పాటుచేశారు. పల్లపు ప్రాంతాల్లో గ్రావెల్ పోసి చదును చేశారు. కార్యక్రమంలోఎంపీటీసీ సభ్యుడు చంద్రారెడ్డి, శశి పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరం

నింద్ర: మండలంలోని అత్తూరు గ్రామంలో శుక్రవారం తిరుపతి రాస్ కృషి విజ్ఞాన కేంద్రం వారు ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. 80 ఆవులు, 60 గొర్రెలకు చికిత్సలందించి మందులు పంపిణీ చేశారు. శాస్త్రవేత్త శ్రీనివాసులు మాట్లాడుతూ రైతులకు విజ్ఞాన కేంద్రం ద్వారా పంటలపై అవగాహన, విత్తనాల పంపిణీ, పశువులకు వైద్యసేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు.

'అడిగలార్' మరణం తీరని లోటు

నగరి: మేల్ మరువత్తూర్ ఆధ్యాత్మిక గురువు బంగారు అడిగలార్ ఆకస్మిక మరణం ఆధ్యాత్మిక ప్రపంచానికి తీరని లోటని ఆదిపరాశక్తి ఆధ్యాత్మిక ప్రచార కమిటీ సభ్యులు కళాధర్, గంగాధర్, జ్యోతి నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఆదిపరాశక్తి సేవ సంస్థలు నెలకొల్పి ప్రపంచ స్థాయిలో పలు సేవా కార్యక్రమం నిర్వహించిన ఏకైక ఆధ్యాత్మిక కేంద్రం మేల్‌మరువత్తూర్ అని వెల్లడించారు. 2వేల పడకలతో మెగా హాస్పిటల్ ఏర్పాటు చేసి పేద బడుగు వర్గాల కుటుంబీకులకు ఉచితంగా వైద్య సేవలు అందించారని కొనియాడారు. అర్హులందరికీ ఉచితంగా విద్య అందుబాటులోకి తీసుకువచ్చారని, మహిళలకు గర్భగుడి ప్రవేశం కల్పించిన మహనీయుడు ఇక లేరనే వార్తను జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. ఆయన భౌతికంగా లేకున్నా ప్రజలందరికీ వారి ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఆదిపరాశక్తి కమిటీ జిల్లా కార్యవర్గ సభ్యులు సరిత, కృష్ణారెడ్డి, సుబ్రమణ్యం, ముత్తు, ఉమాపతి, ఆది శివ, వాసు పాల్గొన్నారు.

వేతనం చెల్లించాలని వినతి


వెదురుకుప్పం : విధులు సక్రమంగా నిర్వర్తిస్తున్న ఆశ వర్కర్ లలితకు నిలుపుదల చేసిన వేతనాన్ని వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఆశ వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షులు గీత విన్నవించారు. శుక్రవారం ఈ మేరకు ర్యాలీగా వెళ్లి వైద్యాధికారి సురేఖకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, గౌరవ అధ్యక్షుడు నాగరాజు, ఆశ వర్కర్స్ జిల్లా కార్యదర్శి చందామరై, ఉపాధ్యక్షుడు గోవిందస్వామి, కోశాధికారి మాధవి, ఆశ వర్కర్లు అరుణ, మునిలక్ష్మి, సుజాత, రోసమ్మ పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణపై శిక్షణ

నగరి : పంటల్లో సమగ్ర సస్యరక్షణపై రైతులకు ఏడీఏ నాగపద్మిని శిక్షణ ఇచ్చారు. శుక్రవారం మండంలోని ఎం.కొత్తూరు రైతుభరోసా కేంద్రం పరిధిలో సాగులో ఉన్న పంటలను ఆమె పరిశీలించారు. వరి, వేరుశనగ పంటలలో విత్తనశుద్ధి చేసుకోవడంపై రైతులకు అవగాహన కల్పించారు. కాయగూరల పంటల దిగుబడి పెంచుకునే సూచనలు అందించారు. రసాయన ఎరువులు మోతాదులను తగ్గించి, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలని సూచించారు. ప్రకృతి సాగుతో లాభాలబాటలో పయనించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ రాఘవేంద్రయాదవ్ పాల్గొన్నారు.

నగరి: కూష్మాండదేవి అలంకారంలో కరుమారియమ్మ, నింద్ర: సరస్వతి దేవిగా దుర్గాదేవి, గంగాధర నెల్లూరు: చదువులతల్లిగా అల్లియల్లమ్మ, వెదురుకుప్పం: మహాలక్ష్మిగా రాజరాజేశ్వరి, పాలసముద్రం: లక్ష్మీదేవిగా పదివేలమ్మ, పుత్తూరు: సిరులతల్లిగా ఆరేటమ్మ





దేదీప్యం.. దివ్యరూపం

- వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు
- అమ్మవారికి విశేష అలంకరణలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- మొక్కులు చెల్లించుకున్న మహిళలు



కార్వేటినగరం :మహాలక్ష్మీదేవీ అవతారంలో దర్శన మిచ్చిన శ్రీబంగారమ్మ



పుత్తూరు: గజలక్ష్మిగా అలంకారంలో ద్రౌపదీదేవి



వడమాలపేటలో సరస్వతీదేవిగా కన్యకాపరమేశ్వరి





శ్రీరంగరాజపురం:పుష్పయాగానికి విరులను ఊరేగింపుగా తీసుకువస్తున్న కృపాలక్ష్మి, నగరి: కరకంఠేశ్వర ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు, కాత్యాయని అలంకారంలో ఉన్న అన్నపూర్ణదేవికి హారతి సమర్పిస్తున్న అర్చకుడు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు విశేష అలంకరణలో దర్శనమిస్తున్నారు. వివిధ రూపాల్లో ప్రత్యేక పూజలు అందుకుంటున్నారు. విశిష్ట అభిషేకాలతో సేదతీరుతున్నారు. ఈ క్రమంలోనే భక్తులు లలితా సహస్రనామార్చనతో పునీతులవుతున్నారు. శక్తిస్వరూపిణిని భక్తిశ్రద్ధలతో సేవించుకుని పరవశిస్తున్నారు. పాహిమాం మాతా అంటూ ప్రణమిల్లి పులకిస్తున్నారు. ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకుంటున్నారు.

నగరి: దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని బుగ్గఅగ్రహారం కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో కాత్యాయనీదేవి అలంకారంలో అన్నపూర్ణాదేవి దర్శనమిచ్చారు. పట్టణంలోని కామాక్షి సమేత కరకంఠేశ్వర ఆలయంలో దుర్గాదేవి, కామాక్షిదేవికి అర్చకులు దుర్గాప్రకాష్ ప్రత్యేక పూజలు నిర్వహించి వైష్ణవీదేవి అలంకరణ చేశారు. ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లు పర్యవేక్షించారు. కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉత్సవమూర్తికి గజలక్ష్మిగాగా మూలవర్లకు కూరగాయలతో అలంకారం చేశారు. నత్తం కండ్రిగ కరుమారియమ్మ ఆలయంలో అమ్మవారు కూష్మాండదేవిగా భక్తులను కటాక్షించారు.

పుత్తూరు రూరల్: పట్టణంలోని ఆరేటమ్మ, ద్రౌపదమ్మ, కామాక్షమ్మ, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లోని అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. గజలక్ష్మీగా ద్రౌపదీదేవి, లక్ష్మీదేవిగా ఆరేటమ్మను అలంకరించారు. పురవీధుల్లో అమ్మవార్లను ఊరేగించారు.

వడమాలపేట: కన్యకాపరమేశ్వరి దేవి సరస్వతీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు లలితా సహస్రనామార్చనలతోపాటు కుంకుమ పూజలు నిర్వహించారు.

నింద్ర: మండలంలోని కేఆర్ పాళెంలోని మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారు సరస్వతి దేవిగా భక్తులను కటాక్షించారు. ప్రత్యేక స్తోత్ర పారాయణం, భజనలు చేశారు.

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలో వెలసిన అల్లి యల్లమ్మ సరస్వతిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం వైభవంగా పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రమణ్యం, ఆలయ ధర్మకర్త సురేష్ రెడ్డి దంపతులు, అర్చకుడు ఆనంద్ అయ్యంగార్ పాల్గొన్నారు. అనంతరం సుబ్రమణ్యం కస్తూరి దంపతులు అన్నదానం చేశారు.

పట్టువస్త్రాలు సమర్పించిన డిప్యూటీ సీఎం కుమార్తె

శ్రీరంగరాజపురం: మండలంలోని తయ్యూరు పాయికట్టు ఆరిమాకులపల్లెలో వెలసిన శ్రీఆరిమాని గంగమ్మకు నవరాత్రుల సందర్భంగా విశేష అభిషేకాలు నిర్వహించారు. శ్రీనీల గణపతి షోడశపూజ, శ్రీసరస్వతిదేవి హోమం జరిపించారు. అనంతరం డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుమార్తె, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నేత కృపాలక్ష్మి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. పుష్పయాగం కోసం ఊరేగింపుగా సుగంధ సుమాలను అందజేశారు. కృపాలక్ష్మి మాట్లాడుతూ జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. ఆరిమాను గంగమ్మ ఆలయాభివృద్ధికి రూ.1.95 కోట్లు వెచ్చిస్తున్నట్లు వెల్లడించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మమ్మ, ఎంపీపీ సరిత, పార్టీ మండల అధ్యక్షుడు మణి, ఎంపీటీసీ సభ్యులు ఆదిలక్ష్మి, ఆలయ ఈఓ తిమ్మారెడ్డి, ధర్మకర్త లింగారెడ్డి, స్థానిక నేతలు జనార్ధన్, మణి, హరిరెడ్డి, బాబు పాల్గొన్నారు. కార్యక్రమాలకు ఉభయకర్తలు తిరుమల, బొమ్మయ్యపల్లె సర్పంచ్ గోవిందయ్య, మునస్వామినాయుడు, శ్వేత, నరేష్, బాలాజీ వ్యవహరించారు.

కార్వేటినగరం: మండలకేంద్రంలోని బంగారమ్మ ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీదేవీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలు ఎస్. మధు, రవిరెడ్డి సమర్పించిన పట్టు వస్త్రాలు, పుష్ప మాలికలు, విశేష ఆభరణాలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యక్షుడు రంగనాథ మొదలియార్. కార్యదర్శి చంద్రశేఖర్‌పిళ్లై పాల్గొన్నారు. అలాగే ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలత్తూరు గ్రామ సమీపంలోని ముత్యాలమ్మ, బాటగంగమ్మ ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలో ఉన్న అరుణగిరి క్షేత్రంలో రాజరాజేశ్వరిదేవి అమ్మవారు శ్రీమహాలక్ష్మిగా భక్తులకు అభయమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష అభిషేకం నిర్వహించారు. అనంతరం వెండి తొడుగులతో కూడిన ఆభరణాలు, పట్టు వస్త్రాలతో అలంకరించారు.

పాలసముద్రం: మండలంలోని బలిజకండ్రిగలో వెలసిన చెవుటి గంగమ్మతల్లి, మిద్దినత్తంలో పడవేటమ్మతల్లి, నొచ్చిలి గ్రామంలో వెలసిన గిరిరాజ కన్యకా పరమేశ్వరీమాత, గంగాధరేశ్వర పరమేశ్వరిని లక్ష్మీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..?



విలేకర్లతో మాట్లాడుతున్న ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ జిల్లా కమిటీ సభ్యుడు చిన్నబ్బ

శ్రీరంగరాజపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో సుపరిపాలన అందిస్తున్నారని, డిప్యూటీ సీఎం నారాయణస్వామి నేతృత్వంలోనే జీడీ నెల్లూరు నియోజకవర్గం అభివృద్ధి పథకంలో పయనిస్తోందని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు చిన్నబ్బ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గ అభివద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా...? అని టీడీపీ ఇంచార్జి థామస్‌కి సవాల్ విసిరారు. గత టీడీపీ హయాంలో సొంత ప్రయోజనాలు తప్ప ఏనాడూ ప్రజలను పట్టించుకోలేదని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే మారుమూల గ్రామాలకు సైతం రోడ్డు వచ్చాయని, సచివాలయం, రైతుభరోసా, విలేజ్ హెల్త్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీ నిర్మించామని వివరించారు. అలాగే రూ.192 కోట్లతో ఎన్‌టీఆర్ జలాశయం పనులు చేపట్టామన్నారు. ఈ క్రమలో 78 ఆలయాలను జీర్ణోద్ధరణ, నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. 248 ఓవర్ హెడ్ ట్యాంకులు మంజూరు చేశామన్నారు. నిరుపేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పరుగులు తీస్తుంటే ఓర్వలేక టీడీపీ, జనసేన నేతలు విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ ఇన్‌చార్జి థామస్ ఇన్ని రోజులు ఏమి చేస్తున్నారని, ఎన్నికలు సమీపించే సరికి ప్రజలు గుర్తుకు వచ్చారని ఆరోపించారు. థామస్‌కు దమ్ము ఉంటే తనతో పోటీ గెలవాలని, తర్వాతే డిప్యూటీ సీఎంతో పోటీ పడాలని కోరారు. డిప్యూటీ సీఎం తీసుకువచ్చిన పాఠశాలలో చదివిన రోజులు మర్చిపోయావా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని డిప్యూటీ సీఎం నారాయణస్వామిని విమర్శించడం మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మణి, నేతలు జనార్ధన్, డీయస్ రాజు, మహేష్, జయరాజ్, రామకష్ణ, శేఖర్, భూపతిరెడ్డి, మునికృష్ణ, మణి పాల్గొన్నారు.

జగనన్నతోనే ప్రజా సంక్షేమం



సమావేశంలో మాట్లాడుతున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు రూరల్: పేదల మోముపై చిరునవ్వు కొనసాగాలంటే.. ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాలని మంత్రి రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ కల్యాణమండపంలో నిర్వహించిన ×ఏపీకి జగనే ఎందుకు కావాలి÷ కార్యక్రమలో ఆయన పాల్గొన్నారు. వడమాలపేట, నింద్ర, విజయపురం మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో రామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజూ గ్రామాల్లో సంక్షేమ పథకాలతో కూడిన బోర్డును ఆవిష్కరించి, వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేయాలని సూచించారు. గ్రామాల్లోనే బసచేయడం వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలన్నారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. దేశంలో ఎన్నడూ ఎరుగని రీతిలో కొత్తగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని చెప్పారు. పార్టీ మండల కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ, వార్డు వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంలో సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ నేతల తప్పుడు ప్రచారాలను సమవర్థవంతంగా తిప్పికొట్టాలని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నగరి నియోజకవర్గ పరిశీలకుడు మధుసూదనరెడ్డి, వడమాలపేట మండల కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సురేష్‌రాజు, శాప్ డైరెక్టర్ యాదవేంద్రరెడ్డి, వైస్ ఎంపీపీలు లోకేష్, ఉపేంద్ర, డీసీసీ బ్యాంకు డైరెక్టర్ కరుణాకర్‌చౌదరి, సోషల్ మీడియా కన్వీనర్ చంద్రారెడ్డి, పార్టీ నింద్ర మండలంకన్వీనర్ వేణురాజు, జేసీఎస్ కన్వీనర్ బాబురెడ్డి, ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీలు దుర్గ, సుభారామ్, పార్టీ జిల్లా కార్యదర్శి మేరి, సీఏసీఎస్ చైర్మన్ మునికృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ విజయపురం మండల కన్వీనర్ గోపి, జేసీఎస్ కన్వీనర్ రాజగోపాల్, వైస్ ఎంపీపీ బాలాజీ, సింగిల్ విండో కన్వీనర్ హరి పాల్గొన్నారు.



హాజరైన నేతలు, కార్యకర్తలు

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి

పెనుమూరు (కార్వేటినగరం): రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ భవనంలో పార్టీ మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి ఏర్పాటు చేసిన 'ఏపీకి జగన్ ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పేదల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఈ క్రమంలో పార్టీ విజయానికి గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు కీలక పాత్ర పోషించాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరికీ వివరించాలని సూచించారు. విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ నేతల అసత్య ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని స్పష్టం చేశారు. సీఎం వైఎస్ జగనన్న నెరవేర్చిన వంద శాతం హామీలను ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. జీడీనెల్లూరు నియోజకవర్గం నాడు-నేడు ఎలా ఉందో కళ్లకు కట్టినట్లు వివరించి, ప్రతి ఇంటిపై పార్టీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జేసీఎస్ కన్వీనర్ హరికృష్ణ, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మనోహర్, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు దూదిమోహన్, దూది మునేంద్ర, నీలాపండరీనాథ్ పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: మండలకేంద్రంలోని ఓ ప్రైవేటు కల్యాణమండపంలో ' ఏపీకి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని తెలిపారు. అసంతృప్తితో ఉన్నవారిని సమన్వయం చేసుకుంటూ టీడీపీ నేతల విష ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని సూచించారు. సమష్టిగా పని చేసి జగనన్న రామరాజ్యాన్ని మళ్లీ తీసుకువచ్చేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు రమణప్రసాదరెడ్డి, గురవారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మణి, సర్పంచ్ డిల్లయ్య, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి, నాయకులు సూరిరెడ్డి, జనార్ధన్, కోటిరెడ్డి బాబు, హరిరెడ్డి పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి 'సురక్ష'



క్యాంపు ప్రారంభిస్తున్న ఎంపీపీ అనిత

గంగాధర నెల్లూరు : మండలంలోని పాపిరెడ్డి పల్లెలో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును తహసీల్దార్ ఇన్బనాధన్‌తో కలిసి ఎంపీపీ అనిత ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి రక్షణ కల్పిస్తోందన్నారు. ప్రతి ఒక్కరికీ గ్రామాల్లోనే స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్యం అందిస్తున్నారని వెల్లడించారు. అనంతరం వృద్ధులకు ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పార్థసారథిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు భారతీ వెంకటేష్ రెడ్డి, వైస్ ఎంపీపీ బేబి, ఏఎంసీ మాజీ చైర్మన్ నాయకులు చిన్నమరెడ్డి, చంద్ర ,డేవిడ్ పాల్గొన్నారు.

సేంద్రియం.. లాభదాయకం

పాలసముద్రం : సేంద్రియ సాగు లాభదాయకమని, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆముదాల ఆర్‌బీకేలో సేంద్రియ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ భూసార పరీక్ష చేయించుకుని సాగు చేపట్టాలన్నారు. ఆ మేరకు ఎరువులు వినియోగించుకోవాలని, అంతర పంటలపై మొగ్గుచూపాలని సూచించారు. రసాయన మందుల వాడకం తగ్గించడంతోపాటు మిత్ర పురుగులను వృద్ధి చేసుకోవాలని కోరారు. ఆర్‌బీకేల సేవలపు రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల్లో లబ్ధిపొందిన అన్నదాతల జాబితాను పరిశీలించారు. ఈ-క్రాప్ నమోదును తనిఖీ చేశారు.